

కాలమ్ దాటని కబుర్లు

బలభద్రపాత్రుని రమణి



నెల నెలకీ కొన్ని కులాసా కబుర్లు

మా దివాణంలో ఒక రోజు

పూర్వం రాజులూ రాణులూ, ఎస్టేట్లూ ఉన్నప్పుడు, బోలెడు పరివారం, దాసదాసీలూ, వారి జీతభత్యాలు చూడడానికి మేనేజర్లూ, దీవాన్జీలూ..అందరూ వుండేవారు. కానీ ఇప్పుడు భానుమతీ రామకృష్ణ కథల్లో గుండుమణీ, వంట అయ్యరూ, ఇంటిపనికి రంగమ్మలాగా.. అంతమందిని కూడా మేనేజ్ చెయ్యలేం, కానీ మా దివాణంలో నా మొహం మా ఇంట్లో కిందవాటాకి పని చెయ్యడానికో పని మనిషీ, మీదవాటాలో, అంటే మా ఇంట్లో పనిచెయ్యడానికి ఓ పనిమనిషీ, ఒక డ్రైవరూ ఉంటారు.

మా అమ్మ ఉండేటప్పుడు, ఆవిడ తులసికోట దగ్గర పారాయణ పుస్తకం పట్టుకు కూర్చుంటే మా ఆడబిడ్డ, అంటే మా ఆయనకన్నా ఐదేళ్ళు వయసులో పెద్దావిడ, ఈ డ్రైవరూ, పని మనుషులతో భేటీ పడడం కానీ మాటా మంతీ ఆడడం కానీ చేస్తుండేది. అదీ ఒక చోట కూర్చుని కాదు. మొత్తం పెరడంతా కొలుస్తున్నట్లు, పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ "ఒసేయ్ రమా! నువ్వూ అనకూడదే వరమ్మని – తప్పు!" అనో, "ఈ కుమార్ గాడి నోటికి మరీ పదును ఎక్కువౌతోందే ఈ మధ్యా?" అని గట్టిగా అదిలిస్తూనో హడావిడి చేస్తుండేది.

డ్రైవర్ వచ్చి పెద్ద గొంతుతో, వాడి వాదనా, తూఫాన్ మెయిల్‌లా పని చేసే రమ, ఆగకుండా పనిచేస్తూనో, తమ వాదన వినిపించేవారు. మా అమ్మ పారాయణ పుస్తకం పట్టుకున్నా, ఈ జగడం అంతా ఫాలో అయ్యేది. ఆవిడకి సమస్య అర్ధం అయినా, అవకపోయినా "కుమార్‌ది ఏం తప్పులేదు" అనేది.

"నీకేం తెలియదు, నువ్వు నోర్మూయవే" అని మాఆడబిడ్డ ఎంతో చనువుగా, అంతకు మించి అధికారంగా మా అమ్మతో మాట్లాడేది. నేను కూడా అంత అధికారంగా అమ్మతో మాట్లాడేదాన్ని కాదు.

ఇంక మా డ్రైవర్ కుమార్ ఏం తక్కువవాడు కాదు. అమ్మ ప్రాపకం కోసం వాడు, ఆవిడకి బజార్ నుండి జిలేబీలూ, అరటి పండ్లూ, సీతాఫలాలూ తెచ్చి ఇచ్చి, ఆవిడ కాళ్ళు పట్టుడానికి కూడా రెడీ! అందుకే ఆవిడ విషయం మొత్తం వినకుండానే" కుమార్‌ది ఏం తప్పులేదు ఉత్త పిచ్చి వెధవ" అని వెనకేసుకొస్తుండేది. అడపాదడపా వాడికి రెండు,

మూడొందలు ఇస్తూ వుండేది, అందుకే వాడికి ఇంట్లో మా ఆడబిడ్డ నడిపే కోర్ట్‌లో, వేరే లాయర్‌ని పెట్టుకోవాల్సిన అవసరం వుండేది కాదు. అమ్మ పోయాక వాడికి అదే లోటు.

జయమ్మకి పుట్టెడు చెవుడు. అది ఇంటి ముందూ వెనకా, మెట్లూ, డాబా ఊడ్చి వెళ్ళే పని చేస్తుంది. దానికీ మా వరమ్మకీ కూడా పడేది కాదు. మా ఆడబిడ్డ ఇద్దరి వాదనలూ విని తీర్పులిచ్చేది.

నాకు ఈ పంచాయితీలతో సంబంధం లేదు. సింక్‌లో గిన్నెలు ఎండిపోడానికి వీల్లేదు, రమో, వరమ్మో, ఆ ఇద్దరూ డుమ్మా కొడితే, జయమ్మో తోమేసి, నాకు ఇల్లు తుడిచి పెడితే, అంతే చాలు. మిగతావి ఏవీ పట్టించుకోను. నాతో ఎప్పుడైనా వాళ్ళు మాట్లాడితే "పిల్లాడికి ఫీజ్ కట్టాలి. ఓ ఐదు వేలియ్యమ్మా" లాంటి ఆర్థిక విషయాలు తప్ప ఏమీ వుండవు.

కానీ మా ఆడబిడ్డకి అలా కాదు. ఎదురింట్లో కొత్త కోడలితో గొడవయ్యాక ఆమె పుట్టింటికెళ్ళి, అత్తగారి ఇంట్లో అందరిమీదా డొమెస్టిక్ వయొలిన్స్ కేసు పెట్టిందనీ, సందు చివరి సుభ్రమణ్యం గారి అమ్మాయికి అర్జెంటుగా సంబంధం చూసి పెళ్ళి చేసేస్తున్నారనీ, మూడిళ్ళ అవతల అన్నపూర్ణమ్మగారింట్లో దొంగలు పడి, ఆవిడ రవ్వల వడ్డాణం ఎత్తుకుపోయారనీ, అది పుత్తడి కాదు ఇత్తడి అని తర్వాత తెలిసిందనీ" ఇలాంటి న్యూస్‌లు వరమ్మ మోసుకొచ్చేది. ఎందుకంటే దాని మెయిన్ పని వాళ్ళ కుల వృత్తి చాకలి పని. సో... అందరి ఇళ్లల్లోకీ దానికి ఏక్సెస్ వుంటుంది. ఇలాంటి వార్తల కోసం ఆవిడ వరమ్మకి ఊరగాయలూ, రేషన్ కార్డ్ మీద వచ్చే చక్కెరా లాంటివి ఇస్తుంది. నాకు రేషన్ కార్డ్ లేదుకాబట్టి, నేను ఇచ్చేదాన్ని కాదు.

వరమ్మ పనిమానేసి, వెళ్ళిపోయినా కూడా రోజూ, మా ఇంటికొచ్చేది. కబుర్లు వుంటే మోసుకొచ్చేసి. బట్టలుంటే మోసుకెళ్ళేది.

అమ్మకి వరమ్మ అంటే కుడా ఇష్టం. కానీ తన ప్లేస్‌లోకి వచ్చిన శాంత అంటే నచ్చేదికాదు. అమ్మకి ఒంట్లో బాలేనప్పుడు, శాంతని పగలంతా వుండి అమ్మని చూసుకోమని అంటే "ఒద్దొద్దు.. దాని భాష నాకు అర్థంకాదు" అని ప్రతిఘటించింది.

మా ఆడబిడ్డకి అమ్మని "నోరుమూయ్యవే నీకేం తెలీదు" అన్నా నేను చూసినదానికన్నా ఒక మెట్టు ఎక్కువే చూసుకుంది అమ్మని. ఇద్దరూ సఖ్యంగా టీ.వీ సీరియల్స్ చూసేవాళ్ళు అందులో పాత్రల్ని తిడ్తూ, లేదా విమర్శించుకుంటూ కాలక్షేపం చేసుకునేవారు.

ఇద్దరూ ప్రాణస్నేహితుల్లా ఉండేవారు. చిన్నచిన్న పోట్లాటలూ వుండేవి. వీళ్ళ 'దివాణం'లో ఎవరికి ఎంత జీతాలిస్తున్నామో కూడా పూర్తిగా తెలీని అజ్ఞానంలో నేను రోజులు ఈడుస్తున్నాను.

మా ఆయన అక్కగారితోనే ఈ వ్యవహారాలన్నీ జరిపిస్తారు.

నాకు బోలెడు తీరిక, పుస్తకాలు చదువుకోడానికీ, ఓటీటీ సినిమాలు చూసుకోడానికీ హాయిగా వుంటుందని, నేను పట్టించుకోను.

మా చిన్న కొడుకు ఒకసారి అమెరికాలో "ఇల్లు శుభ్రం చెయ్యడం లేదు సరిగ్గా" అని కోడలు అంటే, "ఇండియాలో మా ఇంట్లో ముగ్గురు పనివాళ్ళు వుంటారు" అన్నాడు అని చెప్పింది నాతో.

అమెరికాలో 12 గ్యాస్ స్టేషన్లూ, లెక్కకి మించిన అపార్ట్‌మెంట్లూ, ఫార్మ్ హౌస్‌లూ వున్న మా చిన్నకోడలి తల్లి తండ్రులు, రోజూ ఐదారు గంటలు డ్రైవ్ చేసుకెళ్ళి, చిన్న పనీ, పెద్దపనీ అని లేకుండా, ప్లంబింగ్‌లాంటి పనులు కూడా తామే చేసుకుంటారు.

రిటైరైపోయిన మేము ఇంతమందిని ఎలా మెయిన్‌టెయిన్ చేస్తున్నామని మా కోడలు ఆశ్చర్యపోయింది.

"అదే ఇండియా గొప్పతనం" అని చెప్పాను.

"శాంతా చాలు నువ్వు అక్కర్లేదు" అంటే జయమ్మ వినదు.

"కుమార్ అక్కర్లేదు, నెలకోసారి కొడుకింటికి ఊబర్‌లో వెళదాం" అని మా ఆయన అంటే, కుమార్ ఒప్పుకోడు.

"బరాబర్ చేస్తా" అంటూ బకెట్ నీళ్ళు తీసుకొచ్చి కార్ మీద పోసేసి బర్రబర్రా తుడుస్తూ వుంటాడు.

ఈ రోజు నేను లేచేసరికీ, శాంత ఏడుస్తూ అత్తింటి కొత్త కోడలిలా, కొంగుతో కళ్ళు తుడుచుకుంటూ నిలబడి వుంది నడుం మీద రెండు చేతులూ పెట్టుకుని, చీర కుచ్చిళ్ళు పైకి ఎగ్గట్టి, గట్టిగా గాలి వీస్తే ఎగిరిపోయేట్టుండే మా ఆడబిడ్డ, బరిలోకి దిగడానికి సిద్ధంగా వున్న వస్తాదులా నిలబడి ఉంది.

ఎదురుగా గడపమీద కూర్చుని ఆంధ్రా భాషలో అనర్గళంగా మాట్లాడ్తోంది రమ.

కారు తుడవడం మానేసి, కుమార్ ఫ్రీగా మెగాస్టార్ సినిమా చూస్తున్నంత ఉత్సాహంగా చూస్తున్నాడు.

శాంత నేను రావడం చూసి "చూడమ్మా నన్ను పని మానెయ్యమంటోంది" అని కంప్లైయింట్ చేసింది.

"ఇది నాపని, నిన్ను పెట్టి వెళ్ళానంతే" రమ గయ్యమని అరిచింది.

నేను టీ సిప్ చేస్తూ "రమా ఎప్పుడొచ్చావ్?" అని అడిగాను.

"చూడమ్మా.. శాంతని నేనొచ్చేదాకా చెయ్యమని నేనేగా పెట్టి వెళ్ళాను. ఇప్పుడు నేనొచ్చానుగా మానెయ్యమంటే వినట్లేదు" అంది.

మా ఆడబిడ్డ మధ్యలో "శాంతా! నువ్వు రమ రాగానే పని మానేసి వెళ్ళిపోవాలి" అని తీర్పు చెప్పేసింది.

శాంత ఏడుస్తూ "నా కూతురిని చదివించుకోవాలి. నెలకి పదిహేనొందలు జీతం కట్టాలి, నా మొగుడు ఏ పనీ చెయ్యడూ.. పనిలేక పోతే మేం మాడిపోతాం" అంది ఏడుస్తూ.

రమ దాని మాట పూర్తవకముందే గయ్యిమని అందుకుంది, "నీకీ పని ఇప్పించిందే, నేనొచ్చేస్తే నువ్వెతే వెళ్ళిపోతావని" అంది.

నేను మాత్రం అందర్నీ ఓసారి చూసి, "మీ పనులు మీరు చూసుకోండి.. ఫస్ట్‌కి చూద్దాం" అని కుమార్ గాడి వైపు చూసేసరికి, కారు తుడిచేస్తూ, ఏవో పాటలు పాడడం మొదలు పెట్టాడు.

రమకి టీ గ్లాసు ఇచ్చి తన వత్తాసు చూపించింది మా ఆడబిడ్డ.

నేను శాంతని "పద" అని మెట్లెక్కి పైకి వెళ్ళిపోయాను.

శాంత మాత్రం ఇల్లు తుడుస్తూ, వలవలా ఏడుస్తూ, తన కష్టాలు ఏకరువు పెడ్తూనే వుంది. మధ్యలో డాబా ఊడవడానికి వెళ్తున్న జయమ్మ వచ్చి "ఏవైంది? అని శాంతని అడిగింది.

"నా మొగుడు పనికి వెళ్ళడు. తాగొచ్చి నన్ను కొడ్తుంటాడు. ఇల్లు గడవాలి" అని శాంత చెప్తున్నదాంట్లో, ఆమెకి సగం వినపడి, సగం వినిపించక "నీ మొగుడు ఇంకో పెళ్ళి చేసుకుంటున్నాడా?" అంటోంది.

శాంత నెత్తి మొత్తుకుని "కాదక్కా, రమ నన్ను పని మానేసి వెళ్ళిపొమ్మంటోంది."

అంటే "పట్టు పావడా అడిగిందా నీ కూతురు?" అని జయమ్మ మళ్ళీ అడిగింది.

"నువ్వెళ్ళి పని చూసుకో" అన్నాను.

"కిందమ్మ నన్ను తీసెయ్యమంటోంది కదమ్మా" అని శాంత అడిగితే, నాకు నవ్వొచ్చింది. ఈ జమిందారీ వ్యవహారాలన్నీ తన బాధ్యత అని భావిస్తున్న మా ఆడబిడ్డని తలుచుకుంటే నాకు చాలా నవ్వొస్తుంది.

ఈ ఫన్ అంతా మిస్ అయి, హడావిడిగా ఆ దేవుడి దగ్గరకి వెళ్ళిపోయిన అమ్మని తలుచుకుని బాధేసింది.

"శాంతా! నీ పని నువ్వు చూసుకో. రమకి నేను చెప్తాలే. ముందు ఆ ఏడుపు ఆపెయ్" అన్నాను.

తర్వాత కాలం రాద్దామని పేపర్లు తీసుకున్నాను. చాలా నవ్వొచ్చింది.

Post your comments





